నాటక రంగానికి పూర్వ వైభవం

- నాటక రంగ అభివృద్ధికి మైలవరం జమిందార్ల కృషి
- బాలభారతి సమాజం పేరుతో విశేష సేవలు
- నాటి కళా సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్న స్థానిక కళాకారులు



జరుగుతున్న కథ నాటికలోని సన్నివేశం(ఫైల్)
(ఇన్‌సెట్)మైలవరం శ్రీ బాలభారతి నాట్యమండలి లోగో

జి.కొండూరు: ప్రాచీన యుగం నుంచి నేటి ఆధునిక యుగం వరకు సమాజాభ్యుదయంలో భాగస్వామిగా ఉంటూ మూఢాచారాలు, సామాజిక సమస్యల పరిష్కారంతో పాటు స్వాతంత్రోద్యమం, ప్రజా ప్రయోజన ఉద్యమాల్లో ప్రజలకు ఆలోచన, చైతన్యం, అవగాహన కల్పించడంలో నాటక రంగం కీలకపాత్ర పోషించింది. అలాంటి నాటకరంగం జీవం పోసుకోవడంలో మైలవరం జమిందార్లది కీలకపాత్ర అని చరిత్ర ఆనవాళ్లు చెబుతున్నాయి. నేటి ఆధునిక యుగంలో సినిమాలు, టీవీ సీరియళ్లు ఎన్ని వచ్చినా నాటక రంగానికి ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని కళాకారులు చెబుతున్నారు.

మైలవరంలో చారిత్రక ఆనవాళ్లు..

మైలవరం జమిందార్లు నాటక రంగాన్ని ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషించారని చరిత్ర చెబుతోంది. నాడు 1912లో మైలవరం కంపెనీ అని పిలవబడే 'బాలభారతీ సమాజం'ను స్థాపించిన మైలవరం రెండో రాజాగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజా సూరానేని వెంకటపాపయ్యారావు బహుద్దూర్, నాటకరంగాన్ని, కళాకారులను ఎంతగానో ప్రోత్సహించినట్లు కళాకారులు చెబుతున్నారు. అయితే 1917–18లో బెజవాడలో 'మైలవరం థియేటర్' కట్టిన తర్వాత ఈ నాటక సమాజంను బెజవాడకు తరలించి ఎందరో ప్రముఖ కళాకారులను వేతనాలు చెల్లించి ప్రోత్సహించారు.

ఎందరో కళాకారులు..

మైలవరం బాలభారతి నాటక సమాజ ప్రదర్శన అంటే అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక గుర్తింపు ఉండేదని కళాకారులు చెబుతున్నారు. ఈ నాటక సమాజంలో యడవల్లి సూర్యనారాయణ, జొన్నవిత్తుల శేషగిరిరావు, దైత గోపాలం, ఉప్పులూరి సంజీవరావు, గోవిందరాజుల వెంకట్రామయ్య వంటి ఎందరో సుప్రసిద్ధ కళాకారులు పని చేశారు.

పూర్వ వైభవం దిశగా అడుగులు..

నాటక రంగానికి అంతటి చరిత్ర కలిగిన మైలవరం బాలభారతి సమాజానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నాటి జమిందార్ల వారసులైన ఎస్వీ సుధాకర్‌రావు ముందడుగు వేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 4, 5 తేదీల్లో మైలవరంలో నాటకోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలభారతి సమాజానికి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఇదే మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండల పరిధి వెలగలేరు గ్రామానికి చెందిన నాటక, సినీరంగ కళాకారులు పోలుదాసు రంగనాయకులు, పోలుదాసు శ్రీనివాసరావులు 'ఆదర్శ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ', 'వెలగలేరు థియేటర్ ఆర్ట్స్'ల పేర్లతో సంస్థలను ఏర్పాటు చేసి గత కొన్నేళ్లుగా రాష్ట్రస్థాయి నాటకోత్సవాలను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఇదే మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన నాటక, సినీ రంగ కళాకారుడు వీరంకి వెంకటనర్సింహారావు 'చైతన్య కళా స్రవంతి'అనే సంస్థను స్థాపించి గ్రామంలో నాటకోత్సవాలను నిర్వహిస్తున్నారు.

నాటకోత్సవాలను నిర్వహిస్తున్నా..



నాటక రంగానికి ఆదరణ కల్పించేందుకు కళాకారుడిగా నా వంతు కృషి చేస్తున్నాను. ఆదర్శ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థను ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి నాటకోత్సవాలను నిర్వహించా. ప్రభుత్వం కొద్దిపాటి ప్రోత్సాహం కల్పించి మండల కేంద్రాల్లో వేదికలు ఏర్పాటు చేస్తే నాటక రంగానికి ఊతం వస్తుంది.

– పోలుదాసు రంగనాయకులు, ఆదర్శ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ కార్యదర్శి, వెలగలేరు

నాటక రంగమే జీవితంగా పనిచేస్తున్నా..



నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాం. మా సంస్థ ద్వారా ఎన్నో నాటికలను ప్రదర్శించాం. ప్రస్తుతం సినిమాల్లో నటిస్తున్నాను. ప్రభుత్వం కొద్దిపాటి ప్రోత్సాహం కల్పించి నాటక రంగాన్ని బతికించాలి. కళాకారులను గుర్తించాలి. దీంతో ఈ రంగానికి పూర్వ వైభవం వస్తుంది.

వీరంకి వెంకటనర్సింహారావు, చైతన్య కళా స్రవంతి అధ్యక్షుడు, కోడూరు

అభివృద్ధి దిశగా అడుగులు..



నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నాటి మైలవరం జమిందార్ల వారసులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలోనే బాలభారతి సమాజం నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఏర్పాటు చేశారు. కళాకారులు దశాబ్దాలుగా నాటక రంగ అభివృద్ధి కోసం పోరాడుతున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించాలి.

– మన్నె శ్రీనివాసరావు, బాలభారతి సమాజం కార్యదర్శి, మైలవరం

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ సూరాయిపాలెం ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ సీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సూరాయిపాలెం, సిరి అపార్ట్‌మెంట్ ఏరియా వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వధూవరులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



వేమిరెడ్డిపల్లి(విస్సన్నపేట): మండలంలోని వేమిరెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యుడు వంకిణి సత్యనారాయణచారి కుమారుడు వివాహానికి ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి శనివారం పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, జెడ్పీటీసీ సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, సర్పంచ్ పి.విజయకుమారి, నాయకులు ఓలేటి దుర్గారావు, ఆర్.సత్యనారాయణ, గంటల నాగాచారి, అనుమోలు శివబాజీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, నెక్కళపు సుబ్బారావు, శివయ్య, సూరా వెంకట్రామయ్య, ఎంపీటీసీ సభ్యుడు జి.మల్లయ్య పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఇబ్రహీంపట్నం: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ 2022–23 పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని జాకీర్ హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మహబాషా శనివారం తెలిపారు. కృష్ణా వర్సిటీ జట్టు తరఫున విద్యార్థులు ప్రాతినిధ్యం వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. పంజాబ్‌లోని చండీఘర్ యూనివర్సిటీలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు జరిగే పోటీల్లో 70 యూనివర్సిటీలకు చెందిన జట్లు పాల్గొంటాయన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. జట్టు మేనేజర్ లీలావాణి, కోచ్‌గా రాజశేఖర్ వ్యవహరిస్తారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్‌సాధిక్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ కార్యదర్శిగా చారి



తిరువూరు: ఏపీ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా శాఖ కార్యదర్శిగా తిరువూరు గీతమ్స్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్ఎస్‌బీ చారి ఎన్నికయ్యారు. నూజివీడులో శనివారం జరిగిన కార్యవర్గ ఎన్నికలో చారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ చైర్మన్ మోహనరావు తెలిపారు.

భూ హక్కు పత్రాలతో హాజరు కావాలి



కంచికచర్ల: రైతులు పొలాలకు భూ హక్కు పత్రంతో హాజరుకావాలని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి కోరారు. మండలంలోని పరిటాలలో శనివారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భూములను రీ సర్వే చేసి రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఖచ్చితమైన కొలుతలు, హద్దులతో భూములను రీ సర్వే చేసి హద్దు రాళ్లను పాతిస్తున్నామని రాజకుమారి అన్నారు. కొలతలు పూర్తయిన భూములకు ప్రభుత్వం అందజేసిన సరిహద్దు రాళ్లను పాతారు. స్టోన్ ప్లాంటేషన్ ఈనెల 15తేదీ లోగా పాతేలా చర్యలు తీసుకుంటామన్నారు. డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజేంద్ర ప్రసాద్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు శ్రీలక్ష్మీ, వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్దన్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

నందిగామ: పట్టణంలోని చందర్లపాడు రోడ్డు రహదారి విస్తరణ సందర్భంగా పాత విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన విద్యుత్తు లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు కొనసాగాయి. దీనిపై ఆ శాఖ ఏఈ దిబ్బయ్య మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

మొక్కల సంరక్షణకు విరాళం



ముసునూరు: వృక్షో రక్షతి రక్షితః అంటూ ఓ చిరు వ్యాపారి వృక్షాలపై తనకున్న మమకారంతో మొక్కలు నాటి వాటి సంరక్షిస్తూ అందరి అభిమానాలు అందుకుంటున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడుకు చెందిన చిర్రా బాలకృష్ణ ఆధ్యాత్మిక వాతావరణం, పర్యావరణ పరిరక్షణకై స్థానిక కోదండ రామాలయ ప్రాంగణంలో శనివారం తన కుటుంబ సభ్యులతో కలసి ఉసిరి, మారేడు, రావి, వేప మొక్కలు నాటాడు. వాటి సంరక్షణ కోసం ఏటా రూ.10 వేలు అందజేయనున్నట్లు ప్రకటించాడు. ఈ ఏడాది సంరక్షణ కోసం రూ.10 వేల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు శనివారం రాత్రి అందజేశారు. బాలకృష్ణను గ్రామస్తులు అభినందించారు.

నేటి నుంచి బీరప్ప కామరాతి స్వామివార్ల కల్యాణోత్సవాలు



చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో వేం చేసి ఉన్న కురుమల కులదేవతలైన బీరప్ప కామరాతి స్వామి వార్ల కల్యాణోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామి వార్ల విగ్రహాలకు పూజలు చేసి చనుబండ పెద్ద చెరువులో స్నానమాచరించి జలబిందెలతో గ్రామంలో ఊరేగించనున్నారు. సోమవారం స్వామివార్లకు బోనాలు సమర్పిస్తారు. 18 ఏళ్ల క్రితం ఈ ఉత్సవాన్ని నిర్వహించగా, ఇపుడు తిరిగి ప్రారంభించనుండటంతో వేలాది మంది భక్తులు కార్యక్రమానికి తరలిరానున్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిది



తునికిపాడులో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి, ప్రజాప్రతినిధులు

తునికిపాడు(గంపలగూడెం): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు గడప గడపకు అందుతున్నాయని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. సంక్షేమ పథకాలతో గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. గంపలగూడెం మండలం తునికిపాడు సచివాలయం పరిధిలో రెండో రోజైన శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని దళితవాడ, గిరకలబావి ప్రాంతం, గాంధీ సెంటర్ ఏరియా, కాపుల వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో అమలుచేస్తున్న అభివద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు గడిచిన 45 నెలలుగా అందిన సంక్షేమాల లబ్ధిని వివరిస్తూ ముద్రించిన బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. రాజకీయాలకు అతీతంగా అభివద్ధి, సంక్షేమ పథకాలు నిరాటకంగా కొనసాగాలంటే 2024 సాధారణ ఎన్నిల్లో ప్రజలు వైఎస్సార్ సీపీని మరోమారు బలపరచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. దళితవాడలో పలు రహదారుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరావు, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, సర్పంచ్ నిడికొండ మాధవి, ఎంపీటీసీ సభ్యులు వేల్పుల విజయమ్మ, సొసైటి చైర్మన్లు వేల్పుల చిన్న పిచ్చయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, చెరుకు నరసారెడ్డి, నాయకులు రామిశెట్టి రామారావు, కలవారి బ్రహ్మం, సీహెచ్ నరేంద్ర, కె.కోటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, జి.వెంకన్న, బి.బాబురావు, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకష్టారెడ్డి, ఎస్ఐ వి.సతీష్ పాల్గొన్నారు.

నేడు తునికిపాడులో..

తునికిపాడు(గంపలగూడెం): తునికిపాడు సచివాలయం పరిధిలో మూడో రోజైన ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని పార్టీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

మైలవరం/ఇబ్రహీంపట్నం: మైలవరం, ఇబ్రహీంపట్నం వైఎస్సార్ సీపీ కార్యాలయాల్లో ఆదివారం ఉదయం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, కొండపల్లి మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్ లంకే అంకమోహనరావు తెలిపారు. వేడుకల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొంటారన్నారు. ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచిన మహానేత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధన కోసం ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2011 మార్చి 12న యువజన శ్రామిక, రైతు కాంగ్రెస్ పార్టీని స్థాపించారన్నారు. వైఎస్సార్ సీపీ 12 ఏళ్లు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా గ్రామ గ్రామాన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు నూజివీడులో వేడుకలు

నూజివీడు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శనివారం తెలిపింది. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో నిర్వహించే వేడుకల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నేడు చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని చాట్రాయి గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నాసిరకం విత్తనాలతో నష్టాలు



దిగుబడి రాని మొక్కజొన్న కండెలను చూపిస్తున్న రైతులు

నూజివీడు: మొక్కజొన్న విత్తన కంపెనీల మోసాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల దేవరగుంట రైతులు నష్టపోయిన ఘటనను మరిచిపోకముందే మండలంలోని యనమదలలో రైతులు మోసపోయిన సంఘటన వెలుగు చూసింది. ఓ విత్తన కంపెనీ ఇచ్చిన మొక్కజొన్న విత్తనాలను యనమదలలో 200 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. రైతులకు విత్తనం ఇచ్చే ముందు ఎకరాకు 4 నుంచి 5 టన్నుల దిగుబడి వస్తుందని, దిగుబడినంతా తాము కొనుగోలు చేస్తామని చెప్పి సాగు చేయించారు. తీరా దిగుబడి టన్ను, టన్నున్నర మాత్రమే వస్తుండటంతో రైతులు పీకల్లోతు నష్టాల్లోకి కూరుకుపోతున్నారు. అయితే వ్యవసాయధికారులు సీజన్ ప్రారంభంలో ప్రతి సంవత్సరం కంపెనీ ప్రతినిధులతో గాని, ఆర్గనైజర్లతో గాని ఒప్పందం చేసుకుని సాగు చేయాలని చెప్పడంతో రైతులు సాగుకు ఉపక్రమించారు. దిగుబడి రాక రైతులు నష్టాలపాలయ్యారన్న విషయం తెలుసుకుని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహా శనివారం యనమదలలో రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు ప్రాంతంలోని రైతులకు సీడ్ కంపెనీలు నాసిరకం విత్తనాలు ఇచ్చి మోసం చేస్తూ, వారి జీవితాలతో ఆడుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సదరు సీడ్ కంపెనీ తక్షణమే రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గోపవరంలో గడ్డి వామి దగ్ధం

ముసునూరు: ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గోపవరం గ్రామ దళితవాడలో పుట్ల లక్ష్మణరావుకు చెందిన ఐదు ఎకరాలగడ్డి వామి శనివారం అగ్నికి ఆహుతైంది. నూజివీడు నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను ఆర్పింది. రూ.50 వేలకు పైగా నష్టపోయినట్లు రైతు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆగిరిపల్లిలో అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న ఎస్ఐ చంటిబాబు

ఆగిరిపల్లి: అన్నదానం చేయడం అదృష్టంగా భావించాలని ఆగిరిపల్లి ఎస్ఐ నంబూరి చంటిబాబు అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉదయగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 38వ వారం అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎస్ఐ అన్నదానం ప్రారంభించారు. ఇన్ని వారాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఉదయగిరి కృపారావు, దళిత గిరిజన హక్కుల దండోరా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలపాల సురేష్, మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర ఇన్‌చార్జి కంబాల ప్రదీప్, నూజివీడు పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రత్తిపాటి సురేష్, నెరుసు రామయ్య ట్రస్ట్ ఫౌండర్ నెరుసు రాజేష్, కౌన్సిలర్ కోళ్లపల్లి ఆదినారాయణ పాల్గొన్నారు.

పోలీసు క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ నాగేశ్వరరెడ్డి

నందిగామ: క్రీడల వలన ఎన్నో ప్రయోజనాలున్నాయని ఏసీపీ నాగేశ్వరరెడ్డి అన్నారు. నందిగామ డివిజన్ పరిధిలో పోలీస్ జట్లకు రెండు రోజులపాటు నిర్వహించనున్న 'టీజీఎల కప్–2023' క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన ఈ పోటీలను ఏసీపీ ప్రారంభించారు. ఈ పోటీలలో డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో హడావిడిగా ఉండే పోలీసు సిబ్బందికి క్రీడల వలన మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్ఓ సతీష్, డివిజన్ పరిధిలో వలు స్థాయిల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్యులందరికీ బీమా

కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: రాష్ట్రంలో ఏ సహకార కేంద్ర బ్యాంకూ ప్రవేశపెట్టని విధంగా తమ బ్యాంకు రైతులకు బీమా సదుపాయం కల్పించిందని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. నడిం తిరువూరు పీఏసీఎస్‌లో రూ.25 లక్షలతో ఆధునికీకరించిన భవనాన్ని, కొత్తగా ఏర్పాటు చేసిన సేఫ్ డిపాజిట్ లాకర్లను, క్యాష్ కౌంటర్లను శనివారం ఆయన ప్రారంభించారు. సహకార సంఘంలో సభ్యుడైన రైతు కేవలం రూ.150 చందాతో ప్రమాదబీమా పొందవచ్చని, మిగిలిన ప్రీమియంను సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకు భరిస్తాయని తెలిపారు. జాతీయ బ్యాంకులకు దీటుగా కేడీసీసీ బ్యాంకు శాఖల్లో కూడా సత్వర సేవలందించడం, డిజిటల్ లావాదేవీలను నిర్వహించడంతో ప్రస్తుతం రూ.10 వేల కోట్ల టర్నోవర్‌కు చేరిందన్నారు. అన్ని పీఏసీఎస్‌లలోనూ సేఫ్ డిపాజిట్ లాకర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, జిల్లాలోనే అత్యధిక టర్నోవర్ కలిగిన గంపలగూడెం కేడీసీసీ బ్యాంకుకు ఆధునిక భవనాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు.

రైతుల సంక్షేమానికి కట్టుబడి..

తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రతి సహకార సంఘంలోనూ రుణం అడిగిన రైతులందరికీ త్వరితగతిన మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నడిం తిరువూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గజ్జల సీతారామారావు, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, పలు సహకార సంఘాల అధ్యక్షులు, సీఈఓలు, కేడీసీసీ బ్యాంక్ అధికారులు, నగర పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రామస్వామి మృతి



రామస్వామి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మండలంలోని రేగుంటకు చెందిన గుడిమళ్ల రామస్వామి(60) శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత గుండెపోటుతో మృతి చెందారు. అర్ధరాత్రి సమయంలో ఆయాసంగా ఉండటంతో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ పరీక్షలు నిర్వహిస్తుండగా ఆయన తుదిశ్వాస విడిచారు. రామిస్వామి గతంలో వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా, కాంగ్రెస్ పార్టీ నూజివీడు మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ సచివాలయ గృహసారథులకు నూజివీడు మండల కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయనకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ప్రతాప్

రామస్వామి హఠాన్మరణం విషయం తెలిసి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం రేగుంట వెళ్లి రామస్వామి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, పలువురు ఎంపీపీలు, జెట్పీటీసీ సభ్యులు, నాయకులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

ఆగిరిపల్లి: మండలంలోని నూగొండపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ నల్లమోతు కాంచనరావు తండ్రి జమీస్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం నివాళులర్పించి, కాంచనరావును పరామర్శించారు. చిన్న ఆగిరిపల్లి శివారు సింగన్నగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చిన్ని రాంబాబు తండ్రి సుబ్బారావు ఇటీవల మృతి చెందగా శనివారం రాంబాబును పరామర్శించి, సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరాబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాదిగల సంగ్రామ పాదయాత్ర



నూజివీడు: మాదిగల సంగ్రామ పాదయాత్రను పట్టణంలో శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా బాపూనగర్, సమతానగర్, కోటవారిపేట, నెహ్రూపేట, అజరయ్యపేట, అంబేడ్కర్ సెంటర్, పెద్దగాంధీబొమ్మ సెంటర్, పొట్టిశ్రీరాములు బొమ్మ సెంటర్‌ల మీదుగా చిన్నగాంధీబొమ్మ సెంటర్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా బాపూనగర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ యాంత్రాతి కోటేశ్వరరావు, మాదిగ మహిళా సమైక్య జాతీయ నాయకురాలు చొటపల్లి విజయ, రాష్ట్ర నాయకురాలు సొంగా నక్షత్ర మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ నూజివీడు నియోజకవర్గ కో కన్వీనర్ వెంపటి వెంకటేశ్వరరావు, నాయకులు కంకట వెంకటేశ్వరరావు, కోట దానియేలు, తొమ్మండ్రు రుద్రయ్య, కాటూరు సాగర్, లాగు కుమార్ పాల్గొన్నారు.